

5వ తేదీలోగా పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వచ్చే నెల 5లోపు పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు రూ.125ని చెల్లించాలని డీఈవో రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడువు దాటి డిసెంబరు 12లోగా కడితే అపరాధ రుసుము రూ.50, డిసెంబరు 19లోగా అయితే రూ.200, ఆఖరి అవకాశంగా డిసెంబరు 30లోపు అయితే రూ.500 విద్యార్థులు వారు చదివే పాఠశాలలోనే చెల్లించాలని తెలిపారు.





రేషన్‌కార్డుల కోసం
నిరీక్షణ

- కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరం
- కొత్త రేషన్‌కార్డులు అందిస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఆశలు
- ప్రజాపాలనలో లక్షకుపైగానే దరఖాస్తులు
- దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటికీ ముందుకు సాగని ప్రక్రియ
- జిల్లాలో రేషన్‌కార్డులు ఉన్నది 2.53లక్షల మందికి మాత్రమే

కామారెడ్డి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రేషన్‌కార్డులు లేకపోవడంతో గత ప్రభుత్వ హయాం నుంచి అనేక మంది సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. గత సంవత్సరం క్రితం ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అనుకున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. వివిధ కేటగిరీల కింద ఆరు గ్యారెంటీలకు 13.82లక్షల దరఖాస్తులు రాగా ఇందులో తెల్ల రేషన్ కార్డు కోసం ఆప్షన్ ఇవ్వకపోవడంతో ఆరు గ్యారెంటీల దరఖాస్తులతో పాటు నేరుగా తెల్ల కాగితం పైనే రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు సమర్పించారు. రేషన్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం ఆశలు చిగురింపచేస్తున్నా స్పష్టత మాత్రం రావడం, లేకపోవడం ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో ప్రజల్లో మరింత నిరాశ కనిపిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తుందని ఎప్పుడు కొత్త రేషన్‌కార్డులను ఇస్తుందోనని దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు. రేషన్‌కార్డులు లేక ప్రభుత్వాలు అమలు చేస్తున్నా సంక్షేమ పథకాలకు పేద, మధ్యతరగతి ప్రజలు దూరమవుతున్నారు. రేషన్‌కార్డులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది.

పదేళ్లలో అర్హులైన లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 2.53 లక్షలు మాత్రమే రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,34,743 ఉండగా అంత్యోదయ ఆహార భద్రతకార్డులు 17,655 ఉన్నాయి. అన్నపూర్ణ కార్డులు 901 ఉన్నాయి. ఈ కార్డులకు మొత్తం 8.59లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే ఈ రేషన్‌కార్డు ఆధారంగానే ఆయా కుటుంబాలకు పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు మంజూరు చేస్తూ వస్తు న్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వపాలనలో కొన్ని పథకాలకు మాత్రమే రేషన్‌కార్డును ప్రామాణికం గా చేశాయి. ఆ ప్రభుత్వం కొత్త స్కీంలు తీసుకువచ్చినప్పటికీ పలు స్కీంలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోలేదు. ఇదే నేపథ్యంలో రేషన్‌కార్డుల కోసం గత పదేళ్లలో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నా మోక్షం లభించలేదు. ప్రభుత్వం సైతం దరఖాస్తులను పెండింగ్‌లోనే ఉంచింది.

గత ప్రభుత్వ హయాంలోనే 50 వేలకు పైగానే దరఖాస్తులు

గతంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2016లో కొత్త రేషన్‌కార్డులు మంజూరుచేసింది. అరకొరగానే కార్డులను జారీ చేసింది. అప్పటి నుంచి దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంకా జారీ చేయలేదు. కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 50వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని క్షేత్రస్థాయిలో తహసీల్దార్‌లు విచారణ చేపట్టారు. వివరాలు పౌర సరఫరాలశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. విచారణ సమయంలో కొత్త కార్డులు వస్తాయని చాలా మంది దరఖాస్తుదారులు ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో కార్డుల కోసం సంవత్సరాల తరబడి నిరీక్షిస్తున్నారు. అదేవిధంగా కుటుంబంలో తమ పిల్లలకు వివాహాలు జరిగి కోడళ్ల పేర్లను, వారికి జన్మించే పిల్లల పేర్లను కార్డులో చేర్చేందుకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించినా చాలా వరకు నూతన రేషన్‌కార్డులు ఎవరికి వారే చేసుకుందామని ఆలోచనతో ఉన్నారు. రేషన్‌కార్డుల్లో పేర్లు కలిగి ఉన్న వారిలో ఎవరైన మరణిస్తే వారి పేర్లను తొలగించేందుకు మాత్రం అవకాశం కల్పించింది. రేషన్‌కార్డుల్లో పేర్లు లేనివారికి ఏదైన ఆరోగ్య సమస్య వస్తే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఉచిత సేవలు పొందేందుకు సంబంధిత పత్రాలు సమర్పిస్తే కలెక్టరేట్‌లో అప్పటికప్పుడే వారి పేరిట కలెక్టర్ సంతకంతో తాత్కాలికంగా ఓ కార్డును జారీ చేసేవారు. ప్రస్తుతం ఆ కార్డులు కూడా ఇవ్వడం లేదని పలువురు బాధితులు చెబుతున్నారు.

ప్రజాపాలనలో లక్షకుపైగానే దరఖాస్తులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో సుమారు 21,85,539 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో సుమారు రేషన్‌కార్డులు లేని దారిద్రరేఖకు దిగువన ఉన్న లక్షకు పైగానే ఉంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ స్కీంలకు రేషన్‌కార్డే ప్రామాణికం కానుందున సదరు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 2,53,305 తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో మరో లక్ష మందికి పైగానే రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు కంపల్సరీగా ప్రకటించడంతో తెల్ల రేషన్‌కార్డుకు మరింత డిమాండ్ పెరిగింది.

బీఆర్ఎస్ అంటేనే కాంగ్రెస్‌లో వణుకు పుడుతోంది

- కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాబంధులు తెలంగాణను దోచుకుందామని చూస్తున్నారు
- దీక్ష దివస్ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అంటేనే కాంగ్రెస్ పార్టీలో వణుకు పుడుతోందని, కేసులకు భయపడకుండా జైలుకు వెళ్లైయినా ప్రజల పక్షాన పోరాడుతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటిస్తుండడంతో కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్యగార్డెన్‌లో దీక్ష దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు తెలంగాణ తల్లి, కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహాలకు పూలమాలలు వేశారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పించి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధించేందుకు అయితే జైత్రయాత్ర లేదంటే తన శవయాత్ర అని నవంబరు 29, 2009లో కేసీఆర్ ప్రకటించి బయలు దేరుతుండగా అల్గునూర్ వద్ద అరెస్ట్ చేసి జైలుకు తరలించారని అక్కడ కూడా దీక్ష చేసి ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేయడంతో కేసీఆర్ అరెస్టును నిరసిస్తూ శ్రీకాంతాచారి ఆత్మహత్యకు ప్రయత్నించాడని అన్నారు. ఉస్మానియా క్యాంపస్‌లో ఎందరో విద్యార్థులను ఆంధ్ర పోలీసులు కొడుతుండడం విద్యార్థులు మరలపడుతుండడంతో తెలంగాణకు చెందిన తనను ఇక్కడికి రప్పించారని ఆ సమయంలో తాను విద్యార్థులకు గాయాలవుతుంటే ఎంతో బాధపడ్డానని అన్నారు. అలాంటి ఉద్యమానికి ఊపిరిపోసి ప్రత్యేక తెలంగాణ తీసుకువచ్చిన కేసీఆర్ లేకుంటే ప్రత్యేక తెలంగాణ వచ్చేదా, ప్రజలకు సంక్షేమ పథకాలు దరిచేరుతుండేవా అని అన్నారు. డిప్యూటీ స్పీకర్ పదవిని గడ్డిపోచలాగా తీసిపారేసిన ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన మహనేత కేసీఆర్ అని అన్నారు. ప్రపంచంలో అత్యంత పెద్దదైన ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును ప్రకృతికి ఎదురొడ్డి నిర్మించాడని అన్నారు. బీజేపీ మతకల్లోల చిచ్చుపెట్టి లబ్ధిపొందాలని చూస్తుందని, కల్వకుంట్ల కవితపై దొంగ ఈడీ కేసులు పెడితే కేసీఆర్ లొంగుతాడని ప్రధాని నరేంద్రమోదీ అనుకున్నారని కాని ఎక్కడ లొంగలేదని అన్నారు. ఇక కేటీఆర్ కాంగ్రెస్ అసమర్థపాలనపై అవిశ్రాంత పోరాటం చేస్తున్నారని జైలుకు పోయినా సరే ప్రజల కోసం బరాబర్ కొట్లాడుతామని చెబుతున్నారని అన్నారు. గురుకుల పాఠశాలలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరిశీలిస్తామని అనగానే మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్‌లు ఉరుకుల పరుగులు తీస్తూ పరిశీలన చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు రాబంధులు తెలంగాణను దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వారి పంచన బాన్సువాడ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేరారని అన్నారు. కామారెడ్డిలో జరుగుతున్న దీక్ష దివస్ కార్యక్రమాన్ని భయం భయంగా ఇంట్లో కూర్చుని లైవ్‌లో చూస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మరెందరో తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేసిన దుర్మార్గులకు విజయవంతంగా కొనసాగుతున్న దీక్షదివస్ కార్యక్రమం చెంప పెట్టులాంటిదని అన్నారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులు

- గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే

ఆరు గ్యారెంటీల పేరుతో మోసపూరిత హామీలు ఇచ్చి, బీఆర్ఎస్ పార్టీ తీసుకవచ్చిన అనేక సంక్షేమ పథకాలకు అగ్రాస్ పాట పడినట్లు పెంచి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలుపొందిందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. గ్రామంలోని రైతులకు కేవలం 38శాతం మాత్రమే రుణమాఫీ ఉందని కాంగ్రెస్ ఇచ్చిన దొంగహామీలను ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ రాజు, వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గైని శ్రీనివాస్‌గౌడ్, బలవంతరావు, గెరిగంటి లక్ష్మీనారాయణ, పిట్ల వేణు, సంగీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగ రామేశ్వరాలయానికి పూర్వ వైభవం వచ్చేలా కృషి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు


నాగిరెడ్డిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండూర్ గ్రామంలో ఉన్న అతి పురాతన, ఎంతో ప్రసిద్ధి గల త్రిలింగ రామేశ్వరాలయాన్ని అన్ని రకాలుగా ఆలయ అభివృద్ధి కోసం కృషి చేసి, ఈ ఆలయానికి పూర్వ వైభవం వచ్చేలా కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద 101 జంటలతో రుద్రయాగ, హోమ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై హోమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం నిర్మాణమైన ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఈ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మరుగుదొడ్లు, సీసీ రోడ్డు నిర్మాణానికి ఇతర కార్యక్రమాలకు నిధులను మంజూరు చేశారు. రానున్న శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయం వద్ద జరిగే ఉత్సవాలకు సుమారు లక్ష మంది భక్తులు వచ్చేలా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరచడమే తమ ధ్యేయమన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు నిరుపేదల వైద్యం కోసం సుమారు 1.35కోట్లతో ఎల్‌వోసీలను అందించామన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సుమారు రూ.25 లక్షలను బాధితులకు అందించామన్నారు. నాగిరెడ్డిపేటలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. తాండూరు గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటసీ మనోహర్‌రెడ్డి, తాండూర్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు శుక్రవారం సాయంత్రం నేరుగా గ్రామానికి వెళ్లి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మరికొంత మందికి కూడా ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో అర్హులైన వారికి మంజూరు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని గత ప్రభుత్వ హయాంలో ఏ వర్గానికి న్యాయం జరగలేదని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అన్ని అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, నాయకులు వెంకట్రాంరెడ్డి, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాపై చలి పంజా


కామారెడ్డిలో పొగమంచు

- రోజురోజుకూ అమాంతంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- జుక్కల్‌లో 9.7, బొమ్మన్‌దేవునిపల్లిలో 9.9 అత్యల్ప ఉష్ణోగ్రతల నమోదు
- వణుకుతున్న జిల్లావాసులు

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాపై చలి పంజా విసురుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా తీవ్రమైన చల్లటి గాలులతో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. జిల్లాలో శుక్రవారం రెండు గ్రామాలను ఆరెంజ్ జోన్‌లుగా వాతావరణ శాఖ ప్రకటించింది. జుక్కల్‌లో రికార్డుస్థాయిలో 9.7, నస్రూల్లాబాద్ మండలం బొమ్మన్ దేవునిపల్లిలో 9.9డిగ్రీల అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయంటే చలి తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. చలి తీవ్రతతో జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడి ప్రజలు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఇక సాయంత్రం 5.30 గంటలు దాటిందంటే చలి గజగజ వణికిస్తోంది. చలి బారి నుంచి రక్షించుకునేందుకు స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించి బయటకు వస్తున్నారు.

అమాంతంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

జిల్లా పరిధిలో గత 15 రోజుల వ్యవధిలోనే ఉష్ణోగ్రతలు అమాంతంగా పడిపోయాయి. తెల్లవారు జామున పనులు చేసుకునేవారు చలిని తట్టుకోలేకపోతున్నారు. పేపర్‌బాయి మొదలుకొని మున్సిపల్ కార్మికులు, ఇతర కూలీలు విధులు నిర్వహిస్తుంటారు. మంచుతో ఉండడంతో తమ పనులు చేసుకోవడానికి వారు అవస్థలు పడుతున్నారు. అలాగే కూలినాలి చేసుకునే కార్మికులు జీవనోపాధి కోసం రాత్రిళ్లు వాచ్‌మెన్ విధులు నిర్వహించే వారు మంట వేసుకుంటున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంటే చలి మంటలు కాసుకుంటున్నారు. చీకటి పడగానే భారీగా మంచు కురుస్తోంది. వాహనాలు సైతం మంచులో తడిసి ముద్దవుతున్నాయి.

రెండు గ్రామాలు ఆరెంజ్‌జోన్‌లోకి..

జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోయి ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగింది. రాత్రి సమయంలోనే కాకుండా పగటి పూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు జుక్కల్, బొమ్మన్‌దేవునిపల్లి ప్రాంతాల్లో 10 డిగ్రీల కంటే తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అధికారులు ఆరెంజ్ జోన్‌లుగా ప్రకటించారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా 28.9 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో చలి తీవ్రతతో పాటు చల్లటి గాలులు పగలు, రాత్రులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

గ్రామం	కనిష్ఠ	గరిష్ఠ
జుక్కల్	9.7	28.5
బొమ్మన్‌దేవునిపల్లి	9.9	27.5
బీర్కూర్	10.1	28.4
బిచ్కుంద	10.5	29.2
లచ్చపేట	10.9	27.5
ఎల్పుగొండ	11.1	30.6
నస్రూల్లాబాద్	11.2	32.4
ఇసాయిపేట	11.5	26.9
రామలక్ష్మణపల్లి	11.6	27.2
పిట్లం	11.6	28.9
మేనూరు	11.7	28.9
గాంధారి	11.7	29.6
రామారెడ్డి	11.7	29.6
దోమకొండ	11.8	27.9
పుల్కల్	11.9	27.4
లింగంపేట	12.0	26.8
డోంగ్లీ	12.1	27.7
సర్వపూర్	12.2	34.4
సోమూర్	12.3	29.5
కొల్లూర్	12.6	29.8
మాచాపూర్	12.7	27.7
బీబీపేట	12.7	27.7

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

బోధన్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని, తక్షణమే పే స్కేల్ అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి మాట ఇచ్చిన ప్రకారం సమగ్ర శిక్షా ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్న ఇప్పటికీ హామీ నెరవేరలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో డిసెంబర్ మొదటి వారంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్, జిల్లా సాంస్కృతిక కార్యదర్శి బాబు, జిల్లా సహాయ కార్యదర్శి నగేష్, బోధన్ డివిజన్ అధ్యక్షులు యుసుఫ్ అలీ, సీఆర్పీల సంఘం మాజీ అధ్యక్షులు శివానంద్, సీఆర్పీలు రేఖ, విజయ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసి తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనట్లయితే వచ్చే డిసెంబర్ 9నుండి తాము సమ్మె చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు రాకేష్, లక్ష్మి నారాయణ, అరవింద్, సంతోష్ తదితరులున్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

నవీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల మూల మలుపు సమీపంలో శుక్రవారం బైక్‌అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. నిజామాబాద్‌కు చెందిన రవి, నాగరాజులు బైక్‌పై నవీపేట మీదుగా ధర్మాబాద్ వెళ్తుండగా స్పీడ్‌బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో వారికి గాయాలయ్యాయి. వెంటనే బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

బాల్య వివాహాలు నేరం



పోతంగల్‌లో మాట్లాడుతున్న సీడీపీవో రాధిక

కోటగిరి,నవంబరు29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నేరమని ఐసీడీఎస్ సీడీపీవో రాధిక పేర్కొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాలు జరిగితే తమకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, జిల్లా కో-ఆర్డినేటర్ స్వప్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమలత, మణి తదితరులు పాల్గొన్నారు.

రైతులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

కోటగిరి,నవంబరు29(ఆంధ్రజ్యోతి): రైతులు విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని కోటగిరి ట్రాన్స్‌కో ఏఈ బుజ్జి బాబు సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు నాణ్యమైన ఐఎస్ఐ గుర్తింపు పొందిన పరికరాలను వాడాలని సూచించారు. వ్యవసాయ పంపు సెట్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హరితహారం చెట్లు నరికివేయడంపై ధర్నా

కోటగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా హరితహారంలో నాటిన చెట్లను నరికి వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో పెంచిన మొక్కలు వృక్షాలుగా మారాయని, వాటిని ఓ రైతు అనుమతి లేకుండా నరికివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం గ్రామ పంచాయతీలో సమాచారం ఇస్తే కొమ్మలు నరికి వేయించే వారమని వారు పేర్కొన్నారు. సదరు రైతుపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీఓ చందర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కృష్ణ కుమార్, గౌస్, అంజనేయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


మధ్యాహ్నభోజనాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

కమ్మర్‌పల్లి, నవంబరు 30 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచి సుచికరమైన భోజనాలు అందించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ అంజనేయులుతో కలిసి సందర్శించి మధ్యాహ్నభోజనాలను పరిశీలించారు. సమావేశంలో ఎంఈవో ఎస్.ఆంధ్రయ్య, హెచ్‌ఎం గంగాధర్, ఉపాధ్యాయులు రాజేశ్వర్ గౌడ్, సీఆర్పీ లలిత, ఎంఎస్ఐ నరేందర్, ఆపరేటర్ చింతప్రవీన్ మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కుప్కాల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులు పనితీరు, సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని సూచించారు.

రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి

ఆర్మూర్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో రోడ్డువిస్తరణ పనులు, వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి శుక్రవారం నిజామాబాద్‌లో రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్ నుంచి మంతెన మీదుగా దేగాం వరకు, ఆర్మూర్ నుంచి మిర్దాపల్లి మీదుగా దేగాం వరకు, నందిపేట, జన్నెపల్లి మీదుగా తల్వేద వరకు రోడ్డు వెడల్పు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా మిర్దాపల్లి, దేగాం వంతెన పునర్నిర్మాణం, మంథని, దేగాం వంతెన, పిప్రి, ఖానాపూర్ గ్రామాల మధ్య మైనర్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ రూ.46కోట్ల 50లక్షల అంచన కాపీని మంత్రికి అందజేసి విన్నవించగా స్పందించిన మంత్రి ఆమోదం తెలిపారు. రహదారుల వెడల్పు, వంతెన నిర్మాణానికి నిదులు మంజూరుకు ఆమోదం తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు వినయ్‌రెడ్డి దన్యవాదాలు తెలిపారు.


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వినయ్‌రెడ్డి

రేవంత్ చేతిలో తెలంగాణ బందీ

● దీక్షా దివస్‌లో బీఆర్ఎస్ నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదకొండు నెలల కాంగ్రెస్ పార్టీ పాలనలో తెలంగాణ రాష్ట్రం తలకిందులయిందని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, జిల్లా దీక్షాదివాస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన దీక్ష దివాస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రిని తిట్టని తిట్లు ప్రజలు తిడుతున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. గతంలో ఆంధ్ర పాలకుల హయాంలో ఎన్ని జీవోలు ఉన్నా తెలంగాణ వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని కేసీఆర్ తెలంగాణ కోసం ఉద్యమం చేపట్టాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఇవ్వడానికి కమిటీల పేరుతో తాత్సారం చేస్తూ వచ్చిందన్నారు. తెలంగాణ రాక ముందు సమైక్య పాలకుల చేతిలో తెలంగాణ బందీ అయిందన్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి చేతిలో తెలంగాణ బందీ అయిందన్నారు. పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బీఆర్ఎస్ పార్టీ ఉండదని మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్‌ను తీసివేయడం మీ తాతల తరం కూడా కాదన్నారు. కేసీఆర్ ఆనవాళ్లను తీసివేయడం అంటే ఇంత మంది కార్యకర్తలను లేకుండా చేయడమేనని అన్నారు. ముఖ్యమంత్రి ఎంత కింది స్థాయికి దిగజారారంటే దీక్షాదివస్‌కు మీడియా కవరేజ్ ఎక్కువ అవుతుందని ప్రతీ జిల్లాకు మంత్రి పర్యటనలు పెట్టి పంపాడని అన్నారు. ఆ పనులు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన పనులకు కొబ్బరి కాయలు కొడుతున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదని 2027లో జమిలి ఎన్నికలు వస్తున్నా యని అన్నారు. అధికారం ఉందని మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు కొత్తగా ఏమీ కాదని దీక్ష దివస్‌కు స్ఫూర్తిగా తీసుకొని మళ్లీ పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా వారు అన్నారు.

● ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కంటతడి..

దీక్ష దివాస్ కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ఉద్యమ జ్ఞాపకాలను చెబుతూ కన్నీరు తెచ్చుకున్నారు. ఉద్యమంలో జరిగిన పరిస్థితులను వివరించారు. కేసీఆర్ దీక్ష చేపట్టిన రోజును ఇబ్బంది పడ్డ క్షణాలను గుర్తుచేసుకొని కన్నీరు తెచ్చుకున్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరుకావడంతో మరోసారి కంటితడి పెట్టారు.

● రేవంత్‌రెడ్డి బీజేపీ ఏజెంట్..

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ ఏజెంట్ అని నిజామాబాద్ రూరల్ మాజీఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. దీక్షాది వాస్ స్ఫూర్తితో ప్రజల్లోకి వెళ్లి అధికారం లోకి రావడానికి ప్రయత్నం చేయాల న్నారు.

తెలంగాణ తెచ్చిన ఘనత కేసీఆర్‌ది...

సోనియా గాంధీ మెడలు వంచి తెలంగాణను తెచ్చిన ఘనత కేసీఆర్‌దని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి అన్నారు. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయన్నారు. లగచర్ల నుంచి మొదలుకొని దివాల్‌పూర్ వరకు ప్రజలు తిరుగుబాటుకు సిద్ధమ య్యారని అన్నారు.

దీక్షా దివాస్ చరిత్రను పిల్లలకు తెలపాలి...

దీక్షా దివాస్ చరిత్రను మన రాబోయే తరానికి తెలపాలని నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త అన్నారు. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధ్యమైందన్నారు. నవంబర్ 29 దీక్షా దివాస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి : అడిషనల్ కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

నవీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాల, నవీపేట మోడల్ పాఠశాల హాస్టల్‌ను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. మొదట మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన తాగునీటి శుద్దికరణ యంత్రం పని చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత యంత్రానికి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. మెనూప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ఆహార వస్తువులను పరిశీలించారు. స్థానిక యూపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట గదిని పరిశీలించి పప్పు నాణ్యతగా లేదని వెంటనే నాణ్యతతో కూడిన పప్పును అందించాలని ఎంఈవోను ఆదేశించారు. నవీపేట మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మోడల్ పాఠశాల హాస్టల్‌లో వంటగదిని పరిశీలించి, ఆహార పదార్థలను తిని నాణ్యతను పరిశీలించారు.

క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి

● ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు పట్టుదలతో ఆడి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని మినీస్టేడియంలో 46వ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళ హ్యాండ్ బాల్ పోటీలను ప్రారంభించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు జిల్లా బాక్సింగ్ క్రీడాకారిణి నిఖిత్‌జరీన్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగి పతకాలు సాధించాలని అన్నారు. అంతకు ముందు క్రీడాకారులు మార్చ్‌ఫస్ట్‌ను నిర్వహించారు. టోర్నీలో తెలంగాణలోని పది జిల్లాల జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగామోహన్‌చక్రు, ప్రధానకార్యదర్శి పింజ సురేందర్, వైస్‌చైర్మన్ షేక్‌మున్న, స్థానిక కౌన్సిలర్ ఫయాజ్, హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలు నిబంధనల మేరకు జరగాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలలో ఎరువుల విక్రయాలు పీవైఎస్ మెషిన్ ద్వారా మాత్రమే జరపాలని జిల్లా వ్యవసాయాదికారి వాజిద్‌హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పూర్, పచ్చలనడ్కుడ, రామన్నపేట్, వ్యవసాయ సహకార సంఘాలు, అంక్సాపూర్, లక్కోర గ్రామాలలోని పీఏసీఎస్ శాఖలను ఆయన తనిఖీ చేశారు. ఎరువుల విక్రయాలు, పీవైఎస్ మెషిన్ ద్వారా మాత్రమే జరపాలని సూచిస్తూ స్టాక్ రిజిష్టర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డెట్ చేయాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాదికారిణి శృతి, ఏఈవో సాయిరామరాజ్, సొసైటీకార్యదర్శులు స్వామి, కృష్ణ, రణవీర్; ఆయా సొసైటీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

చలి ప్రభావంతో వరినారు మళ్ళకు తెగులు

జక్రాన్‌పల్లి: చలి ప్రభావం తీవ్రతరం కావడంతో మండలంలోని వివిధ గ్రామాలలో వరినారు మళ్ళకు తెగుళ్ల సోకాయని వ్యవసాయాధికారిణి దేవిక తెలిపారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను ఆమె సందర్శించారు. అనంతరం చలి ప్రభావం తీవ్రంగా ఉండడంతో వరినారు మళ్ళకు అగ్గితెగులు, ఇతర తెగుళ్ల సోకాయని, ఈ తెగుళ్ళ నివారించేందుకు చర్యలు తీసుకునేందుకు రైతులకు అవగాహన కల్పిస్తూ సలహాలు, సూచనలు అందజేశారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

● బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు దేహదారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రీడపోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి స్రవంతి, జిల్లా సహాయ సంక్షేమ అధికారి నర్సయ్య, గంగాధర్, వసతి గృహల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

విద్యా వనరుల కేంద్రం ప్రారంభం

ముప్కాల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలో నూతనంగా విద్యావనరుల కేంద్రాన్ని శుక్రవారం విద్యాధికారి జక్కుల రవి ప్రారంభించారు. ఇటీవల నూతనంగా నియమితులైన జక్కుల రవిని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్, ముప్కాల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గంగారాం, కేజీబీవీఎస్‌వో వినోద, ముప్కాల్ మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ


భోజనం చేస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌రూరల్, నవంబరు 29 : పట్టణంలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, డార్మేటరీ, మరుగుదొడ్లు, వంటగది, పిల్లలకు భోజనం వడ్డించే గదులను ఆయన పరిశీలించారు. బాత్‌రూం డోర్‌లు, కిటికీలకు మరమ్మతులు చేయాల్సి ఉన్నందున వాటిని వెంటనే మరమ్మతులు చేయిం చాలని పాఠశాల ప్రత్యేక అధికారిణి గంగామణికి సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడా లని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. అనం తరం విద్యార్థులకు అందజేసే భోజనాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి మున్సిపల్ కమిషనర్ రాజు భోజనం చేశారు.

క్లాస్‌రూమ్‌లో గుండెపోటుతో లెక్చరర్ మృతి


గోవర్ధన గిరి (ఫైల్)

కోటగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్ గోవర్ధన గిరి(49) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తుండగా చాతిలో నొప్పి రావడంతో కళాశాల అధ్యాపకులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కళాశాలకు తీసుకువెళ్లారు. విద్యార్థులతో మాట్లాడుతుండగా గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలారు. ఈ విషయమై విద్యార్థులు తోటి అధ్యాపకులకు వివరించగా అప్పటికే గోవర్ధన గిరి మృతి చెందారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహానికి అధ్యాపకులు తరలించారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల మధ్య గత కొంత కాలంగా విబేధాలు నెలకొన్నాయి. గురువారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన రవీందర్‌కు గోవర్ధన గిరికి మధ్య తీవ్ర వివాదం చోటు చేసుకున్నట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం తరగతి గదికి వెళ్లిన ఆయన గుండెపోటుకు గురై మృతి చెందడం కళాశాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. అధ్యాపకులు, విద్యార్థులు లెక్చరర్ మృతిపట్ల కన్నీటి పర్యంతమయ్యారు.

మొరం తవ్వకాలపై నిఘా



మొరం టిప్పర్‌ను తనిఖీ చేస్తున్న మైనింగ్ అధికారులు

ఎడపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన గుట్టలు మాయం అనే కథనం శుక్రవారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. రోడ్డు రవాణా శాఖ, భూగర్భ గనుల శాఖ (మైనింగ్)ల అధికారులు బోధన్ డివిజన్‌లో అకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా ఎడపల్లి మండలంలోని జానకంపేట, ఠాణాకలాన్ రోడ్డు ఏరియా ప్రాంతంలో కొనసాగుతున్న, మొరం రవాణా చేస్తున్న వాహనాలను తనిఖీ చేసి అనుమతి కాగితాలను పరిశీలించారు. ఠాణాకలాన్ రోడ్డులో మొరం టిప్పర్‌ల అనుమతి కాగితాలను పరిశీలిస్తున్న భూగర్భ గనుల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ నాగేష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మండలంలో ఎక్కడెక్కడా మొరం తవ్వకాలు జరుపుతున్నారో వాటిని గుర్తించడం జరిగిందని, ప్రతీ మొరం తరలించే వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించిన రైతులు

జక్రాన్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్‌లో నిర్మిస్తున్న జేఎంకేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని శుక్రవారం వికారాబాద్ జిల్లా రైతులు సందర్శించారు. వికారాబాద్ జిల్లాలోని బాగాపూర్, మేడికొండ, గంగుపల్లి గ్రామాలకు చెందిన 45మంది రైతులు ఈఎంఎస్‌ఎంఈ మంజూరైన ఉత్పత్తిదారుల సంఘాన్ని రైతులు సందర్శించారు. ఐసీఏఆర్ ఇండియా సెంట్రల్ ఇన్‌చార్జీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైయి లాండ్ అగ్రికల్చర్ హైదరాబాద్ వారి నేతృత్వంలో వహించారు. కార్యక్రమంలో రైతులు, రైతు ఉత్పత్తిదారులు సంఘాలు నేలకొల్పడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని స్థానిక జేఎంకేపీఎం రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ పి.తిరుపతిరెడ్డి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ రీసోర్స్ సైంటిస్టు నిర్మల బృందం అధికారులు దినేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సన్నరకం పండించిన రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ రైతు ఖాతాలో జమ చేస్తున్న సందర్భంగా వేల్పూర్ మండ కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డితో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డిలు చిత్రప టానికి క్షీరాబిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి ఆదేశానుసారం ఈ కార్య క్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు జీవన భృతి అందించాలని ధర్నా


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

రెంజల్,నవంబరు29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వారికి న్యాయం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం రెంజల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మికులతో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో వ్యవసాయ కూలీలకు 12వేల జీవన భృతి అందిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందని, హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, ఇచ్చిన మాటప్రకారం వ్యవసాయ కూలీలకు 12వేల రూపాయల జీవన భృతిని అందించి వారిని ఆదుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పుట్టి నాగన్న, నసీర్, పోశెట్టి, ఒడ్డెన్న, గంగాధర్, సాయిలు, రవి, లక్ష్మణ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

కోటగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం ఎరువుల దుకాణాన్ని శుక్రవారం వ్యవసాయ అధికారిణి నిశిత తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టార్లను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని సూచించారు. రైతులకు సరిపడ ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో తదితరులు ఉన్నారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్టు

ఆర్మూర్‌టౌన్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీజేవైఎం నాయకులను శుక్రవారం ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి ముందస్తు అరెస్టు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు పెడుతున్న పురుగుల అన్నం తిని అస్వస్థతకు గురవుతున్నారని, హైదరాబాద్‌లోని డీడీ భవన్ ముట్టడికి పిలుపునివ్వడంతో బీజేవైఎం నాయకులు హైదరాబాద్ వెళ్ళకుండా స్థానిక పోలీసులు బీజేవైఎం నాయకుల ఇంటికి వెళ్ళి ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి మందుల బాలు, పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, ఉపాధ్యక్షుడు పెద్దోళ్ళ భరత్, ప్రమోద్, తదితరులు ఉన్నారు.

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నందిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదుట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గౌడ కులస్థులు ఆందోళన చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌పై ఆర్మూర్ మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై గౌడ కులస్తులు మండిపడ్డారు. ఆగ్రహించిన గౌడ సంఘం సభ్యులు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, యువజన నాయకులు బైండ్ల ప్రశాంత్, గౌడ సంఘం నాయకులు అశోక్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

జక్రాన్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పి.పూజిత ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి శుక్రవారం తెలిపారు. మంచిర్యాల్‌లో ఈనెల 30నుంచి డిసెంబర్ 2వరకు జరిగే రాష్ట్రస్థాయి బీచ్‌వాలీబాల్ పోటీల్లో పూజిత పాల్గొంటుందని తెలిపారు. ఈసందర్భంగా పూజితను ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, వ్యాయమ ఉపాధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

భిక్కనూరులో సీఎం దిష్టిబొమ్మ దహనం

భిక్కనూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా పట్టించుకోవడం మానేందని ఆరోపిస్తూ, విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భిక్కనూరు మండలకేంద్రంలోని సినిమా టాకీసు చౌరస్తాలో ఏబీవీపీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర నాయకులు గందం సంజయ్, జిల్లా నాయకులు సమీర్ మాట్లాడుతూ ఒకే సంవత్సరంలో 886మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురయ్యారని, పదుల సంఖ్యలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజు, శివ, యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

భిక్కనూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలాక్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లి వృక్షం పూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు వీలైనన్ని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరా రు. ముఖ్యంగా విద్యార్థులు పుట్టిన రోజులు, ఇతరితర ప్రత్యేక రోజుల్లో మొక్కలు నాటాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్, పీడీ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

బోధన్‌రూరల్,నవంబరు29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని సాలూర సహకార సంఘం చైర్మన్ అల్లె జనార్ధన్ అన్నారు. శుక్రవారం సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దేహదారుఢ్యం పెంపొందించడానికి డబుల్ బార్, కుల్లాప్ బార్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో సాలూర మండల విద్యాశాఖ అధికారి మంజూష పాల్గొన్నారు.

రైతు పండగను విజయవంతం చేయండి


మోర్తాడ్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు పండగ కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్ కోరారు. శనివారం మహబూబ్‌నగర్ అమిస్తాపూర్‌లో సీఎం, మంత్రులు అతిథులుగా రైతు పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



సోమారం గ్రామ పంచాయతీ భవనం


గ్రామంలో అపరిశుభ్రంగా మురికికాలువ


చేతులు వంకరబోతున్నాయని చూపుతున్న వృద్ధుడు


చికెన్ గున్యాతో బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

విజృంభిస్తున్న చికున్ గున్యా

- సోమారం గ్రామాన్ని వణికిస్తున్న చికున్ గున్యా, విష జ్వరాలు
- గ్రామంలో 350 కుటుంబాలు ఉండగా 250 కుటుంబాలకు చికెన్ గున్యా, విష జ్వరాలు
- 15 రోజుల నుంచి మంచానికే పరిమితమైన చికున్ గున్యా బాధితులు
- మురికి నీరు, అపరిశుభ్రత వల్లే విస్తరిస్తున్నాయని గ్రామస్థుల ఆవేదన
- తక్షణమే మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని వేడుకోలు
- ప్రైవేట్ ఆసుపత్రుల్లో తడిసి మోపెడవుతున్న బిల్లులు



మందులు కొనుగోలు చేసిన గ్రామస్థురాలు


గ్రామంలో పాకురు పట్టి అపరిశుభ్రంగా ఉన్న వాటర్ ట్యాంకర్, పారుకు పట్టి అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

తాడ్వాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని సోమారం గ్రామంలో చికున్‌గున్యా విజృంభిస్తోంది. గ్రామంలోని 350 కుటుంబాలు ఉండగా అందులో సుమారు 250 కుటుంబాలకు పైగా చికున్ గున్యా, విషజ్వరాలు బారిన పడి విలవిల్లాడుతున్నారు. గత 15 రోజుల నుంచి గ్రామంలో నడవలేని పరిస్థితుల్లో రోగులు మంచానికే పరిమితమయ్యారు. ఓవైపు చలి, మరోవైపు విష జ్వరాలు, చికున్‌గున్యాతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత కారణంగానే విష జ్వరాలు, చికున్‌గున్యా వంటి వ్యాధులు వస్తున్నాయని గ్రామస్థులు చెప్తున్నారు. గ్రామంలో మురికి కాలువల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుంది. గ్రామంలో వాటర్ ట్యాంకు మొత్తం అపరిశుభ్రంగా ఉంది. గత 15 రోజుల నుంచి ప్రైవేట్ దవాఖానాలకు కుటుంబం నుంచి సుమారు రూ.20వేల రూపాయల నుంచి 30వేల రూపాయలు ఖర్చు చేశావని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత ఖర్చుచేసినా రోగాలు నయం కావడం లేదని కంటతడి పెడుతున్నారు. గ్రామాల్లో ఎటూ చూసినా మంచానా పడిన బాధితులు కనిపిస్తున్నారు. కుటుంబంలో మొత్తం చికున్ గున్యా బారిన పడి పనులు చేసుకోవడానికి వీలు లేకుండా ఉందని వృదులు విలపిస్తున్నారు. వృద్ధుల నుంచి చిన్నపిల్లలు సైతం చికున్‌గున్యా బారిన పడుతున్నారు. చికున్ గున్యాతో కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నామని, మందులు వాడుతున్నా.. రోజులు గడుస్తున్నా నొప్పులు తగ్గడం లేదని వాపోతున్నారు. గ్రామంలో ఏటూ చూసినా మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా ఉన్నారు. ఇన్‌చార్జి కార్యదర్శితో ఇబ్బందులు కూడా ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. ఏ ఒక్క అధికారి కూడా గ్రామంలోకి రావడం లేదని గ్రామస్థులు అంటున్నారు. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం వీడి గ్రామంలో హెల్త్ క్యాంప ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


దురదతో బాధపడుతున్న చిన్నారి


చికున్ గున్యాతో మంచానికే పరిమితమైన వృద్ధురాలు

నడవలేని పరిస్థితుల్లో ఉన్నాం..

● భూమవ్వ, గ్రామవాసి



గత 15 రోజుల నుంచి చికెన్ గున్యా వల్ల నడవలేని పరిస్థితుల్లో ఉన్నాం. చికెన్ గున్యా విష జ్వరాలతో గ్రామమంతా నిండిపోయింది. అధికారులే కాపాడాలి.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేలు ఖర్చు చేస్తున్నాం..

● నారాయణ, గ్రామస్థుడు



చికున్ గున్యాతో కాళ్ల చేతులు వంకరైపోయి నడవలేని పరిస్థితుల్లో ఉన్నా. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేలకు వేలు ఖర్చు పెట్టాం. అయినా తగ్గం లేదు. గ్రామంలో అపరిశుభ్రత కారణంగానే రోగాలు వస్తున్నాయి.

ఫోకస్


వినియోగంలో లేని కన్కల్ వైకుంఠధామం


చెదలు పట్టి పాడైపోయిన రూమ్ డోర్

వైకుంఠ ధామాల్లో కనీస వసతులేవీ?

- తాడ్వాయిలో రూ.14.15 లక్షలతో వైకుంఠధామం
- నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు

తాడ్వాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత టీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామానికి వైకుంఠ ధామాన్ని సుమారు రూ.14.15 లక్షలతో నిర్మించారు. కానీ మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రం ఇప్పటికీ వైకుంఠధామాలను గ్రామస్థులు ఉపయోగించుకోవడం లేదు. ప్రతీ గ్రామంలో ఎవరి ఆచారం ప్రకారం వారు దహన సంస్కారాలు చేస్తుంటారు. గ్రామాల్లో కొందరికి దహన సంస్కారాలకు స్థలం లేకపోవడంతో ప్రభుత్వం వైకుంఠధామాలను నిర్మించింది. కానీ వాటిలో కనీస వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొన్ని గ్రామాలలో వైకుంఠధామాలు నిర్మించడానికి స్థలం లేకపోవడంతో గ్రామస్థులు అంతా ఏకమై ఎక్కడో ఒకచోట స్థలాన్ని కేటాయించి ఇచ్చారు. మండలంలోని కన్కల్ గ్రామంలో గ్రామస్థులంతా ఏకమై ఎస్సీ వాళ్లకు చెందిన స్థలాన్ని ఇచ్చి మరీ వైకుంఠ ధామాన్ని నిర్మించారు. గతంలో స్థలం ఇచ్చినందుకు గ్రామ పంచాయతీ ద్వారా కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇస్తామని తెలిపారని గ్రామస్థులు కొందరు తెలిపారు. ఇప్పటి వరకు వైకుంఠధామం నిరుపయోగంగా ఉంది. అందులో ఉన్న రూములు దర్వాజాలు మొత్తం చెడిపోయి ఉన్నాయి. వైకుంఠధామాల్లో కనీస వసతులు కూడా కరువయ్యాయి. దీంతో దహన సంస్కారాలు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మండలంలో ఏయే గ్రామంలో వైకుంఠధామాలు నిరుపయోగంగా ఉన్నాయో వాటిని ఉపయోగించే విధంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు తేవాలని ప్రజలు కోరుతున్నారు.


ఉపయోగంలో లేక చెదలు పట్టి పాడైపోయిన డోర్



వైకుంఠధామాల్లో వసతులు కల్పించి వినియోగంలోకి తేవాలి

● మర్రి బాపురెడ్డి, కన్కల్

గ్రామంలో ఏర్పాటు చేసిన వైకుంఠధామాలు వసతులు లేక ఎవరూ వినియోగించుకోవడం లేదు. గ్రామంలో అవగాహన కల్పించి వైకుంఠ దామాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

వసతులు కల్పిస్తాం

● సయ్యద్ సాజీద్ అలీ, మండల అభివృద్ధి అధికారి

వైకుంఠధామాలు వినియోగం లేని విషయం వాస్తవమే. అందులో కావాల్సిన వసతులను త్వరలోనే ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

కన్నుల పండువగా శంభులింగేశ్వరుడి కల్యాణం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని శంభులింగేశ్వరుడి మాస కళ్యాణం కన్నుల పండుగగా సాగింది. భక్తుల శివనామస్మరణ వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలతో నిర్వహించిన కల్యాణోత్సవంలో అర్చకులు దేవశర్మ కళ్యాణతంతును శాస్త్రోక్తంగా జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శివపార్వతులను ఉంచి కల్యాణంలోని ముఖ్య ఘట్టాలైన పాదప్రక్షాళణ, మధుపర్కం, యజ్ఞోపవిత దారణ, మంగళ అష్టకాలు, కన్యాదానం, తలంబ్రాలు, బ్రహ్మముడి తంతును అర్చకులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాదంలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తి


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితుడు

వైభవంగా నీలకంఠేశ్వరుని కల్యాణోత్సవం

● 21 జంటలతో కల్యాణ మహోత్సవ వేడుకలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలు భక్తుల నీలకంఠుని స్మరణలతో నీలకంఠేశ్వర కల్యాణోత్సవం వైభవోపేతంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శివపార్వతులను ఉంచి కల్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా అర్చక స్వాములు నిర్వహించారు. శుక్రవారం కార్తీకమాస శివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించిన కళ్యాణ వేడుకల్లో భక్తులు 21 జంటలతో కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలు పఠిస్తూ ఉండగా అర్చకులు మకరంద్ శాఖాయ్, సుహాల్ శాఖాయ్, నీలేశ్, శేఖర్‌లు కల్యాణంలోని ముఖ్య ఘట్టాలైన పాదప్రక్షాళణ, మధుపర్కం, నూతన వస్త్రాల సమర్పణ, జీలకర్ర బెల్లం, కన్యాదానం, మాంగళ్య సూత్రదారణ, తలంబ్రాలు, మాలాపరివర్తన, బ్రహ్మముడి తంతును నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీరాం రవీందర్‌గుప్త, సిబ్బంది ఉన్నారు.


ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న పురోహితులు, పాల్గొన్న భక్తులు

నల్లవెల్లికి లైన్‌మెన్ వచ్చేదెన్నడో?

- రెండు నెలలు క్రితం బదిలీపై వెళ్లిన లైన్‌మెన్
- నేటికీ రాని కొత్త ఉద్యోగి
- ఇబ్బందులు పడుతున్న రైతులు, గ్రామస్థులు

జర దేఖో!!



ఇందల్వాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ లేక రైతులు, గ్రామస్థులకు ఇబ్బందులు పడుతున్నారు. జూనియర్ లైన్‌మెన్ ఒక్కరే విధులు నిర్వహిస్తుండటంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. గతంలో లైన్‌మెన్‌గా పనిచేసిన శ్రీనివాస్ గత రెండు నెలల క్రితం బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇంతవరకు మరో లైన్‌మెన్‌ను అధికారులు నియమించలేదు. నల్లవెల్లి మేజర్ గ్రామ పంచాయతీలో మొత్తం 158 గృహ, వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. గ్రామంలో 13, వ్యవసాయానికి 145 ట్రాన్స్‌ఫార్మర్లు ప్రతీరోజు నడుస్తుంటాయి. 11కెవి నాలుగు ఫీడర్లు ఉన్నాయి. సిర్నాపల్లి సబ్ స్టేషన్ నుంచి నల్లవెల్లితోపాటు స్టేషన్ తండా, క్యాబిన్ తండాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. గత రెండు నెలలుగా లైన్‌మెన్ లేకపోవడంతో జూనియర్ లైన్‌మెన్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ అంతరాయం కలిగితే ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదని రైతులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నల్లవెల్లి గ్రామానికి లైన్‌మెన్‌ను బదిలీ చేయాలని కోరుతున్నారు.

రెండు నెలలుగా లైన్‌మెన్ లేడు..

● దేంబాల్ శశిధర్‌రెడ్డి, రైతు



గత రెండు నెలలుగా లైన్‌మెన్ గ్రామంలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ం. విద్యుత్ సమస్యలపై పలుమార్లు ఉన్నతా ధికారులకు విన్నవించినా ఫలితం లేదు. అధికారులు స్పంది ంచి వెంటనే నల్లవెల్లి గ్రామానికి లైన్‌మెన్‌ను బదిలీ చేయాలని కోరుతున్నాం.

ఇన్‌చార్జి లైన్‌మెన్‌ను పంపించాం

● రవీందర్, ఎస్‌ఈ, ట్రాన్స్‌కో

బదిలీ అయిన లైన్‌మెన్ స్థానంలో ప్రస్తుతానికి ఇన్‌చార్జి లైన్‌మెన్‌ను పంపించాం. కొత్త లైన్‌మెన్‌లు వస్తే నల్లవెల్లికి బదిలీ చేస్తాం. నెల సమయం పట్టచ్చు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రైస్‌మిల్లర్లు అగ్రిమెంట్లు సమర్పించాలి

● కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి సీఎంఆర్ రైస్‌మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటి, అగ్రిమెంట్లు సమర్పించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రైస్‌మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం సీఎంఆర్ కోసం మిల్లుల యజమానులు బ్యాంక్ గ్యారెంటీని వెంటనే సమర్పించాలని అన్నారు. ధాన్యం కేటాయింపులు జరుగుతున్న దృష్ట్యా త్వరగా అందించాలని తెలిపారు. గత 2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ వెంటనే సరఫరా చేయాలని లేకపోతే డిఫాల్ట్ అయిన మిల్లులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, పౌర సరఫరాల శాఖ మేనేజర్ రాజేందర్, డీఎస్‌వో నరసింహారావు పాల్గొన్నారు.

పేదలకు విద్య, వైద్యం అందించాలి

● ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా

తాడ్వాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. మండలంలోని పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ ఎస్టీ ప్రజలందరికీ విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు అనే ఐదు అంశాలను ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ గత వారం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అయినా దీనిపైన ఎలాంటి స్పందన లేని కారణంగా శుక్రవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి మరోసారి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బోలేశ్వర్, అరవింద్, మండల అధ్యక్షుడు రాజశేఖర్, గౌరవధ్యక్షులు బాబు, సాయికుమార్ మహరాజ్, ఉపాధ్యక్షులు బాబు, మోహన్, ప్రధాన కార్యదర్శి మండల కమిటీ సభ్యులు రవీందర్, కోశాధికారి స్వామి, ప్రవీణ్, సత్యం, నితిన్, శివరామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే తోటపై ఆరోపణలు చేయడం సరికాదు'

పిట్లం, నవంబరు 29: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్‌పై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే లేనిపోని ఆరోపనలు చేయడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంరెడ్డి అన్నారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో విలేకరుల సమావేశంలో రాంరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గత 15 సంవత్సరాలుగా పదవిలో ఉండి నియోజకవర్గ అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ మనోజ్‌కుమార్, వైస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, మండలాల అధ్యక్షుడు జంబిగె హన్మండ్లు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవోస్ ఎల్లారెడ్డి తాలూకా నూతన అధ్యక్షుడిగా మహిపాల్, కార్యదర్శిగా శ్రావణ్, కోశాధికారిగా రవీందర్, వైస్ ప్రెసిడెంట్ రాజాగౌడ్, శ్రీకాంత్, వసంత లక్ష్మీ, జాయింట్ సెక్రటరీ సంతోష్‌రెడ్డి, అభినవ్‌కుమార్, స్వాతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కృష్ణ, శంకరయ్య, ఈసీ మెంబర్ ప్రశాంత్‌కుమార్, శారదా శరత్, చంద్ర ప్రసాద్, రవీందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీని వేగవంతం చేయండి

పెద్ద కొడప్‌గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమగ్ర సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో వేగం పెంచాలని మండల ప్రత్యేక అధికారి భాస్కరన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జుక్కల్ ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని పరిశీలించారు. సమగ్ర సర్వే పూర్తయిన గ్రామాల వివరాలను ఆయా గ్రామాలకు చెందిన సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

'స్త్రీలపై హింసను ముక్త కంఠంతో వ్యతిరేకిద్దాం'

తాడ్వాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవ పక్షోత్సవాల సందర్భంగా 'స్త్రీలపై, బాలికలపై జరుగుతున్న హింసను ఎదుర్కొండి' అనే నినాదంతో 15 రోజుల కార్యక్రమాల్లో భాగంగా తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌స్పైర్, సొసైటీ ఫర రూరల్ డెవలప్‌మెంట్ (ఐఎస్ఆర్‌డీ) స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు సోలంకి రవళి మాట్లాడుతూ మహిళల సంరక్షణార్థం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా వాటిని సరైన సమయంలో ఉపయోగించకపోతే ఇలాంటి నైతిక విలువలు కోల్పోయి మహిళలపై దాడులకు పాల్పడుతారని తెలిపారు. సైబర్ మోసాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని, మహిళలపై హింసలు, దాడులు జరిగితే 181కు కాల్ చేసి రక్షణ సహాయం పొందవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్, హాన్స్‌స్, సోషల్ వర్కర్ ప్రత్యూష, అధ్యాపకులు సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్షలు

రామారెడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ప్రతిభ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోసానిపేట్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి ముగ్గురు విద్యార్థినులు గెలుపొందారు. ప్రథమ బహుమతి తాత్విక, ద్వితీయ బహుమతి ఎస్.మానస, తృతీయ బహుమతి బి.భవితలు ప్రతిభ ప్రదర్శించి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈవో నిట్టపు ఆనంద్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం


బీర్కూర్‌లో ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్యామల

బీర్కూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం మార్కెట్ యార్డు ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్‌గా దుర్గం శ్యామల, ఉపాధ్యక్షుడిగా యామ రాములు, డైరెక్టర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మాజీ డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు సురేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి రమ్య నూతన పాలకవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు కృషి చేయాలని నూతన పాలకవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మాజీ డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ స్థాయి నాయకుడు సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శశికాంత్, గంగారాం, గాంధీ, శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం


తాడ్వాయిలో..

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఎల్లారెడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు సన్న రకం ధాన్యానికి రూ.50 బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని అదే విధంగా రెండు లక్షల లోపు రైతు రుణ మాఫీ చేసిన సందర్భంగా శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్, ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుల చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసినట్లు అధ్యక్షుడు జూగంటి వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, సీనియర్ నాయకులు అంబీరు శ్యామ్‌రావు, అధికార ప్రతినిధి షౌకత్ అలీ, టీడీపీ అధ్యక్షుడు మేకల రాజు తదితరులు ఉన్నారు.

గాంధారి: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరమేష్, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట పీఏసీఎస్‌లో రైతుపండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించామని చైర్మన్ కంది రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు మధుకర్, చిన్నసాయిలు, దుర్గరెడ్డి, సీఈవో సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని ముత్యంపేట సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో సీఎం చిత్ర పాటానికి క్షీరాభిషేకం చేశామన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ సిద్ధ రాములు, డైరెక్టర్ సిద్ధ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతు పండుగను ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఎల్లమయ్య, ఇబ్రహీమ్, షాదుల్లా, సాయికుమార్, రవి, ప్రసాద్, రాము, రాజులతో పాటు నాయకులు ఉన్నారు.

నసురుల్లాబాద్: మండలంలోని మిర్జాపూర్, మైలారం, నసురుల్లాబాద్ సహకార సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు సహకార సిబ్బంది రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు గంగారాం, హన్మంత్‌రావు, రాంబాబు, సొసైటీల కార్యదర్శులు, సహకార సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.


గాంధారిలో..



ముత్యంపేటలో..


లింగంపేటలో..


నసురుల్లాబాద్‌లో..

రైతులకు సకాలంలో డబ్బులు అందేలా పని చేయండి

పెద్ద కొడప్‌గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం పరిధిలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు తొందరగా ఖాతాల్లో జమయ్యే విధంగా పని చేయాలని మండల తహసీల్దార్ దశరథ్ సహకార సిబ్బందికి సూచించారు. శుక్రవారం పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం పరిధిలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముతున్నందున వారి ఖాతాల్లో డబ్బులు తొందరగా వచ్చేలా సిబ్బంది పని చేయాలని సూచించారు. అనంతరం సీఈవో సందీప్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించిన డబ్బులు సుమారుగా 80 నుంచి 85 శాతం రైతుల ఖాతాల్లో పడటం జరిగిందని, మిగతా వారి డబ్బులు కూడా ఖాతాల్లో తొందరగా పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు ప్రత్యక్షం


మధ్యాహ్న భోజన బియ్యంలో ప్రత్యక్షమైన పురుగులు

రామారెడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినాలంటేనే విద్యార్థులు భయపడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. భోజనానికి ఉపయోగించే బియ్యంలో పురుగులు రావడంతో విద్యార్థినులు, విద్యార్థుల ఆందోళన చెందుతున్నారు. తాజాగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యంలో శుక్రవారం తెల్లటి పురుగులు కనిపించడంతో టీచర్లు, విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరన్న వివరణ కోరగా బియ్యంలో పురుగులు వచ్చినవి నిజమేనన్నారు. విద్యార్థులు తినే అన్నంలో మాత్రం పురుగులు రాలేదని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరుగకుండా ముందస్తుగా ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరారు.

గ్రంథాలయంలో సర్వసభ్య సమావేశం


గ్రంథాలయ సెస్‌పై చర్చించి డీపీవోను సన్మానిస్తున్న చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి బడ్జెట్ ఆమోదం, కొత్తపత్రికలు, మాసపత్రికల చందాల ఆమోదం, గ్రంథాలయాలను 24 గంటల పాటు నిర్వహించేందుకు భద్రత సిబ్బంది నియామక అనుమతి, లైబ్రరీ సెస్ పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరుతూ స్థానిక సంస్థలకు విజ్ఞప్తి తదితర అంశాలను ఆమోదించారు. అనంతరం బిచ్కుందలో పని చేస్తున్న నిస్సార్ అహ్మద్ పార్ట్‌టైం వర్కర్ పదవి విరమణ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్‌రావు, ఎంఈవో ఎల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

దోమకొండ(బీబీపేట)నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం డిప్యూటీ డీహెంహెచ్‌వో ప్రభుకిరణ్ పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు, సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ భానుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరంపల్లి వద్ద గల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అనేక రకాల సౌకర్యాలను కల్పిస్తుందని అధికారులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని అన్నారు. అంతకుముందు 19, 4 వార్డులలో ముస్లిం శ్మశానవాటికలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుక్కోజివాడి ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్నభోజనం తీరును పరిశీలించి చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల్లో బడీడు పిల్లల గుర్తింపు

రామారెడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలవాయి గ్రామ శివారులోని ఇటుక బట్టీల వద్ద శుక్రవారం సీఆర్‌పీ మహమూద్ సర్వే చేసి పది మంది బడీడు పిల్లలను గుర్తించారు. ఈ పిల్లల కోసం అవాస ప్రాంత పాఠశాల ఏర్పాటు చేయడం కోసం ఉన్నతాధికారులకు పిల్లల వివరాలు పంపించడం జరిగిందని పిల్లల కోసం తల్లిదండ్రులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ పోటీలకు గాంధారి విద్యార్థిని

గాంధారి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-8 కిడ్స్ అథ్లెటిక్స్ పోటీలకు గాంధారి మండల కేంద్రానికి చెందిన చెల్సియా రాథోడ్ ఎంపిక అయినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రాథోడ్ తెలిపారు. ఈనెల 25 న జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పోటీలో 50 మీటర్ రన్నింగ్ స్టాండింగ్ బ్రాడ్ జంప్ విభాగంలో పోటీపడి మొదటిస్థానం పొందినట్లు ఆయన తెలిపారు. డిసెంబరు 1న మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు.

'ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలి'

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న ఫుడ్‌పాయిజన్‌లకు నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చామని విద్యార్థిసంఘ నాయకులు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చామని అందరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు అరుణ్, సురేష్, శివ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రైతులను రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యం

సదాశివనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సింగిల్‌విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి అన్నారు. శుక్రవారం అడ్లూర్ ఎల్లారెడ్డి సహకార సంఘంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం వరి ధాన్యం పండించడంలో ప్రథమస్థానంలో నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో బైరయ్య, డైరెక్టర్‌లు రాములు,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

దోమకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి జ్యోతి అన్నారు. శుక్రవారం ఆమె సీతారాంపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్‌రావ్, ప్రిన్సిపాల్ మంగమ్మ పాల్గొన్నారు.

సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : ఏవో

దోమకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దోమకొండ రైతు వేదికలో శనివారం నిర్వహించే మహబూబ్‌నగర్‌లో అమిస్తాపూర్ నందు నిర్వహించే రైతు పండుగ భారీ మహాసభ నందు సీఎం పాల్గొనే కార్యక్రమాన్ని మండల రైతులు వీసీలో పాల్గొని విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారిణి మణిదీపిక శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని విజయవంతం చేయాలని కోరారు.


బాలల హక్కులపై అవగాహన సదస్సు

గాంధారి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్తలు మోహన్, వీణలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, బాల్యవివాహాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలలపై లైంగిక వేధింపులకు నుంచి రక్షణ పొందాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం, కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం ప్రిన్సిపాల్ శిల్ప ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరం చేస్తే శిక్ష అనుభవించక తప్పదు

దోమకొండ (బీబీపేట) నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నేరం చేస్తే శిక్ష అనుభవించక తప్పదని భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలోని వడ్డెర కాలనీలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. చేడు అలవాట్లు, నేర ప్రవర్తనకు దూరంగా ఉండాలని సమాజంలో మంచి పేరును సంపదించుకునేలా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో భిక్కనూర్ మండలంలోని కంచర్ల గ్రామ శివారులో వ్యవసాయ భూమినందు మహిళ హత్య కాగా, అందులో నేరస్తులుగా యాడారం గ్రామ వడ్డెర కాలనీకి చెందిన వ్యక్తులు నేరస్తులుగా ఉండగా వారిని పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టుకు పంపించడం జరిగిందన్నారు. ఆయనతో పాటు బీబీపేట ఎస్సై ప్రభాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	- దేవకి నందన వసుదేవ
దర్శన్	- జిబ్రా
ప్రియా 35	- అమరన్
ప్రియా 70	- మెకానిక్ రాకి

బాన్సువాడ	
మహేశ్వరి	- మెకానిక్ రాఖీ
వెంకటేశ్వర	- కేసీఆర్ (కేశవ చంద్ర రమావత్)

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

